## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 23-10-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- సులభతర వాణిజ్యం నుండి వేగవంతమైన వాణిజ్యం దిశగా ఆంధ్రప్రదేశ్ పయనిస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- రాష్ట్ర వ్యాప్తంగా ప్రాంతీయ అభివృద్ధి అధికారుల (డి.డి.ఓ.) కార్యాలయాలను నవంబర్ 1 నుంచి ప్రారంభించాలని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ఆదేశించారు.
- బంగ్లాదేశ్ లో చిక్కుకున్న విజయనగరం మత్స్యకారులను తిరిగి తీసుకొచ్చేందుకు చర్యలను వేగవంతం చేశామని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు.
- రాష్ట్రంలో నాలుగైదు రోజులు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో క్షేత్రస్థాయిలో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని హోం మంత్రి వి. అనిత ఆదేశించారు.
- మహిళల వన్డే ప్రపంచ కప్ లో భాగంగా న్యూజిలాండ్ తో జరుగుతున్న క్రికెట్ మ్యాచ్ లో భారత్ భారీ స్కోర్ దిశగా పయనిస్తోంది.

====================

యూఏఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు అబుదాబీ చేరుకున్నారు. అబుదాబీ చాంబర్ ఛైర్మన్ అహ్మద్ జాసిమ్ అల్ జాబీ, జీ 42 సీఈఓ మన్సూర్ అల్ మన్సూరీతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. సులభతర వాణిజ్యం నుండి వేగవంతమైన వాణిజ్యం దిశగా ఆంధ్రప్రదేశ్ పయనిస్తోందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. రాజధాని అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సేవలు జనవరి నుంచి అందుబాటులోకి వస్తాయన్నారు. అమరావతి నూతన అవకాశాలకు, ఆవిష్కరణలకు కేంద్రంగా ఉంటుందని చంద్రబాబు నాయుడు వారికి వివరించారు. విశాఖపట్టణంలో నవంబర్ 14, 15వ తేదీల్లో జరిగే భాగస్వామ్య సదస్సుకు రావాలని వారిని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆహ్వానించారు.

====================

రాష్ట్రంలో స్థానిక సంస్థలను బలోపేతం చేస్తూ పాలనాపరమైన సంస్కరణలు తీసుకువచ్చామని, వాటి ఫలాలు ప్రజలకు సక్రమంగా అందించే బాధ్యత ఉద్యోగులపై ఉందని ఉప ముఖమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. నవంబర్ 1వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రాంతీయ అభివృద్ధి అధికారుల (డి.డి.ఓ.) కార్యాలయాలు ప్రారంభించాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి ఆయన కార్యాలయంలో ఈరోజు మధ్యాహ్నం సమావేశమయ్యారు. క్లస్టర్ విధానం రద్దు చేసి 13 వేల 351 గ్రామ పంచాయతీలను స్వతంత్ర యూనిట్లు చేయడం ద్వారా గ్రామస్తులకు మెరుగైన సేవలు అందించే వెసులుబాటు తీసుకొచ్చామని చెప్పారు. పల్లెల్లో కనీస మౌలిక వసతుల కల్పనకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పంచాయతీలు, గ్రామీణాభివృద్ధికి నిధులు సమకూరుస్తున్నామని తెలిపారు.

====================

విజయనగరం జిల్లాకు చెందిన ఎనిమిది మంది మత్స్యకారులు పొరపాటున బంగ్లాదేశ్ సముద్ర జలాల్లోకి ప్రవేశించి అక్కడి నేవీ అధికారుల చేతిలో బందీలు అయిన నేపథ్యంలో బాధితులను తిరిగి తమ సొంత ప్రాంతాలకు తీసుకువచ్చే చర్యలను వేగవంతం చేసామని పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఇప్పటికే ఈ సమస్యపై కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జై శంకర్ తో చర్చించానని వెల్లడించారు. ప్రభుత్వం తరుఫున అన్ని చర్యలు తీసుకుంటున్నామని జై శంకర్ ఈ సందర్భంగా భరోసా ఇచ్చారని, బంగ్లాదేశ్ లో ఉన్న ఇండియా మిషన్, కోస్ట్ గార్డ్ లతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని తనకు వివరించారని రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు.

====================

విశాఖపట్టణం గ్రోత్ హబ్, పూర్వోదయ పథకంపై చర్చించేందుకు నీతి ఆయోగ్ సిఇఓ బి.వి.ఆర్. సుబ్రహ్మణ్యం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తో అమరావతిలోని సచివాలయంలో ఈరోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. దేశ తూర్పు తీరంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ముందు వరుసలో ఉందన్నారు. పూర్వోదయ పథకం ద్వారా తీరప్రాంతంలో మరింత అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ లో పలు ఓడరేవులు ఉన్నప్పటికీ ప్రత్యేకంగా ఒక కంటైనర్ మెగా పోర్టు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని.. ఆదిశగా ప్రయత్నాలు చేయాలని ప్రభుత్వానికి సూచించారు. అనంతరం కె.విజయానంద్ మాట్లాడుతూ.. విశాఖపట్టణం గ్రోత్ హబ్ పనులు వేగవంతం చేసేందుకు ప్రత్యేకంగా ఒక అధికారిని నియమించడం జరుగుతుందని చెప్పారు. రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టులను వేగవతం చేయడంతో పాటూ అనేక నూతన ప్రాజెక్టులు, పరిశ్రమలు ఏర్పాటు అయ్యేలా ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేస్తోందని వివరించారు.

విరామం

====================

బంగాళాఖాతంలోని నిన్నటి అల్పపీడనం పశ్చిమ-వాయువ్య దిశగా కదిలి దక్షిణ అంతర కర్ణాటక దాని పరిసర ప్రాంతాలలో ఈరోజు విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది రాబోయే 24 గంటల్లో పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ తూర్పు, మధ్య మరియు దాని పక్కనే ఉన్న ఆగ్నేయ అరేబియా సముద్రం మీదుగా ప్రయాణించే అవకాశం ఉందని వెల్లడించింది. ఇక దక్షిణ అండమాన్ సముద్రం దాని పరిసర ప్రాంతాలలో సగటు సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని, దీని ప్రభావంతో రేపు బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. ఇది తదుపరి 24 గంటల్లో పశ్చిమ-ఉత్తర పశ్చిమ దిశగా కదులుతూ మరింత బలపడే అవకాశం ఉందని వెల్లడించింది. వీటి ఫలితంగా రేపటి వర్ష సూచనలను వాతావరణ కేంద్రం అధికారి ఎస్. కరుణాసాగర్ వెల్లడిస్తూ…

(వాయిస్ 30 సెకన్లు)

====================

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో హోం, విపత్తు నిర్వహణల శాఖా మంత్రి వంగలపూడి అనిత, నీటి పారుదల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి శ్రవణ మాధ్యమంలో సమీక్ష నిర్వహించారు. మరో నాలుగైదు రోజులు రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని హోం మంత్రి కలెక్టర్లకు స్పష్టం చేశారు. మండల స్థాయిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్స్ లో రెవెన్యూ, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్ శాఖ అధికారులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు.

====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 127వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 24వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

====================

మహిళల వన్డే ప్రపంచ కప్ లో భాగంగా న్యూజిలాండ్ తో జరుగుతున్న క్రికెట్ మ్యాచ్ లో భారత్ భారీ స్కోర్ దిశగా పయనిస్తోంది. ముందుగా బ్యాటింగ్ చేస్తున్న భారత్ 42 ఓవర్లు పూర్తయ్యేసరికి ఒక వికెట్ నష్టపోయి 273 పరుగులు చేసింది. ఓపెనర్లు స్మృతి మంధాన, ప్రతీకా రావల్ శతకాలతో రాణించారు. భారత్ సెమీఫైనల్స్ చేరుకోవాలంటే ఈ మ్యాచ్ లో విజయం సాధించాల్సి ఉంటుంది. ఇక ఆస్ట్రేలియాలోని ఆడిలైడ్ వేదికగా జరిగిన రెండవ వన్డే క్రికెట్ మ్యాచ్ లో భారత పురుషుల జట్టుపై ఆస్ట్రేలియా రెండు వికెట్ల తేడాతో విజయం సాధించింది. భారత్ నిర్దేశించిన 265 పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా 46 ఓవర్లలోనే ఛేదించింది.

====================

పి.ఎం. ఆవాస్ యోజన గ్రామీణ్ పథకాన్ని అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. ఈ పథకం అమలుపై గృహనిర్మాణ శాఖ అధికారులతో కలెక్టర్ భీమవరంలో ఈరోజు సమీక్ష నిర్వహించారు. పి.ఎం ఆవాస యోజన గ్రామీణ్ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు గృహ నిర్మాణాలను చేపట్టేందుకు జిల్లాలోని 319 రెవిన్యూ గ్రామాల్లో నిన్నటి నుండి సచివాలయ సిబ్బందితో సర్వే ప్రారంభమైందని తెలిపారు. నవంబర్ 5వ తేదీ నాటికి ఈ సర్వే పూర్తి అవుతుందన్నారు. ఆధార్ కార్డు, బ్యాంక్ ఎకౌంట్, రెవెన్యూ అధికారులు జారీ చేసిన స్థలం పట్టా నకలు కాపీలను సిద్ధంగా ఉంచుకోవాలని, అర్హులుగా ఉండి సొంత స్థలం కలిగిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

====================
====================